
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



చకచకా

- ప్రధాని పర్యటన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం
- పదుల సంఖ్యలో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు
- రంగంలోకి దిగిన కేంద్ర, రాష్ట్రస్థాయి బలగాలు
- నేటి సాయంత్రానికి పనులు పూర్తయ్యే అవకాశం

సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులు



ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటన నేపథ్యంలో అధికారులు బిజీగా మారారు. ఓ వైపు అధికారులు, మరో వైపు కూటమి నాయకులు ఎవరికి వారు సమీక్షలు, సమాలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు కర్నూలులో మకాం వేశారు. కేంద్ర బలగాలు మూడు రోజుల నుంచి నల్లమల అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. కర్నూలు నగరాన్ని సైతం జల్లెడ పడుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కీలక నాయకులు తమ నేతలతో సమీక్షలు, జనసమీకరణపై దృష్టి పెట్టారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం కర్నూలు, నంద్యాల కలెక్టర్లు డాక్టర్ సిరి, రాజకుమారి, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షెరాన్ ఉదయం నుంచే ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రమిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి పనులన్నీ పూర్తి చేసి ఆయా వేదికలు, ప్రదేశాలను ఎస్పీజీ, కేంద్ర బలగాలకు అప్పజెప్పేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

ప్రధాని ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్



ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

ఓర్వకల్లు/ కర్నూలు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు జిల్లాలో పర్యటన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పరిశీలించారు. ఆదివారం మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలో టోల్‌గేటు వద్ద ఉన్న రాగమయూరి సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించి జరుగుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న శ్రీశైలంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారి దర్శనానంతరం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వస్తారన్నారు. సభకు హాజరు కావడంతో వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమాలు ఉన్నాయన్నారు. ఇప్పటికీ ఏర్పాట్లు కూడా దాదాపు పూర్తి చేశామన్నారు. ప్రధానమంత్రి మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాని ఏర్పాట్లలో అధికారులు సమన్వయంతో పని చేసి పనులను పూర్తి చేయాలన్నారు. మంత్రి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, టీడీపీ యువ నాయకుడు సోమిశెట్టి నవీన్, పునులూరు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

త్వరితగతిన పూర్తి చేయండి

- కలెక్టర్ డాక్టర్ సిరి

ఓర్వకల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉమ్మడి జిల్లా పర్యటన సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఏర్పాట్లను సోమవారం సాయంత్రంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిల్లా పర్యటన సందర్భంగా నన్నూరు టోల్‌గేటు వద్ద ఉన్న రాగమయూరి వద్ద సభాప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను కలెక్టర్‌తో పాటు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ ప్రధాని వచ్చే దారిలో పనులను పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారులు భరత్‌గుప్తా, మౌర్యమాన్ పటేల్, ఆదర్శ రాజేంద్రన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, చల్లా కళ్యాణి, భావన, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అధికారులు



చురుగ్గా జరుగుతున్న రోడ్డు పనులు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు



వీవీఐపీల పార్కింగ్ కోసం యంత్రాలతో శరవేగంగా ఏర్పాట్లు

విజయవంతం చేయండి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఓర్వకల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఓర్వకల్లు మండల పరిధిలోని నన్నూరు గ్రామ సమీపాన గల టోల్‌గేటు వద్ద రాగమయూరి సభా ప్రాంగణం ఏర్పాట్లను అధికారులు, టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ప్రధాని పర్యటనను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు, వాహన సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎంపీ నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి తిక్కారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, మంతెన సత్యనారాయణ రాజు, మీడియా కోఆర్డినేటర్ బి.వెంకటరాముడు, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విద్యుత్ వినియోగదారులకు శుభవార్త

- అదనపు లోడును 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం
- డిసెంబరు 31 వరకు గడువు పొడిగింపు
- ఎస్ఈ ప్రదీప్‌కుమార్



కల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు వాడుకుంటున్న అదనపు లోడును 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. తొలుత మార్చి 1 నుంచి జూన్ 30 వరకు దరఖాస్తులకు ఏపీఎస్‌పీడీసీఎల్ (డిస్కం) ఆహ్వానించింది. వీలైనంత ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో రెండో దఫా డిసెంబరు 30 వరకు గడువు పొడిగించింది. వినియోగదారులు సద్వినియోగం చేసుకుంటే అదనపు చార్జీల బెడద ఉండదని, డెవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎస్ఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్ల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. దీంతో లోడు క్రమబద్ధీకరించకుండా వాడుకుంటున్న వినియోగదారులను గుర్తించి అధికారులు జరిమానా విధిస్తున్నారు. చాలా మందికి ఇంటి విద్యుత్ కనెక్షన్ లోడు ఎంతో తెలియదు. దరఖాస్తు సమయంలో నమోదు చేసిన లోడ్ కంటే... ఏసీ, వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంతో అదనపు వినియోగంతో ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతోంది. ఫలితంగా లోవోల్టేజీ, సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.

స్వచ్ఛందంగా ముందుకొస్తేనే..

జిల్లాలో 6.54 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 30శాతం లోడు క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంది. విద్యుత్ అధికారుల బృందాలు తనిఖీ చేసి, అదనంగా ఎంత లోడు వాడుతున్నారో నమోదు చేస్తారు. ఆ మొత్తానికి నగదు చెల్లించాలని నోటీసులిస్తారు. కిలోవాట్‌కి రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పునఃపరిశీలనకు కొందరు అర్జీలు పెట్టడంలో, మరికొందరు రుసుం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. వినియోగాదరులు లోడు క్రమబద్ధీకరణకు స్వచ్ఛందంగా ముందుకొస్తే అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు అవకాశముంది. అదనపు లోడును రాయితీతో క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం పెంచిన గడువును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ తెలిపారు.

రాయితీ వివరాలు ఇలా

కిలోవాట్	దరఖాస్తు	ఫీజు	డిపాజిట్	రాయితీ లేకుండా	రాయితీతో.. చెల్లించాల్సిన మొత్తం
1- 2	50	200	2000	1000	1250
1-3	50	200	4000	2000	2450
1-4	50	200	6000	3000	3650
1-5	50	200	8000	4000	4850

మొదటి దశలో..

మార్చి 1 నుంచి జూన్ 30 వరకు 728 కిలోవాట్లకు 353 మంది గృహ విద్యుత్ వినియోగదారులు కనెక్షన్లకు అదనపు లోడు క్రమబద్ధీకరించుకున్నారు. తద్వారా విద్యుత్ సంస్థకు రూ.8.73 లక్షలు ఆదాయం వచ్చింది.

ఫీజు వివరాలు

అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా ప్రభుత్వం రూ.200 నిర్ణయించింది. అలాగే డెవలప్‌మెంట్ చార్జీలను రాయితీతో కొంత నగదు చెల్లించాల్సి ఉంది. కిలోవాట్లు పెరిగేకొద్దీ రుసుం పెరుగుతుంది. ఒక కిలోవాట్‌కు సాధారణంగా దరఖాస్తు ఫీజు రూ.50, డిపాజిట్ రూ.200. డెవలప్‌మెంట్ చార్జీ రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుంది. ఇలా ఎన్ని కిలోవాట్ల వరకు లోడు పెంచుకోవాలనుకుంటే దరఖాస్తు ఫీజు మినహా అన్ని రెట్టింపు చెల్లించాల్సి వస్తుంది. డెవలప్‌మెంట్ చార్జీలకు మాత్రమే రాయితీ వర్తిస్తుందని అధికారులు సూచిస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ సిరి తెలిపారు. ప్రధానమంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఒక్కరోజు రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం యథావిధిగా ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు.

నేటి నుంచి నూతన ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలి: డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన కొత్త ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధులకు హాజరు కావాలని డీఈవో శామ్యూల్ పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి స్థానాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, కొత్త టీచర్స్ జాయిన్ అయిన తర్వాత మాత్రమే పాత ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని తెలిపారు. వారి స్థానాలకు కొత్త ఉపాధ్యాయులు రాకపోతే ఎట్టి పరిస్థితుల్లో రిలీవ్ చేయకూడదన్నారు. విద్యాశాఖ తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు అదే స్థానాల్లో పాత ఉపాధ్యాయులు కొనసాగాలన్నారు. ఎంత మంది ఉపాధ్యాయులు చేరినారో వారి వివరాలు ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు మండల విద్యాధికారులు, పాఠశాలల హెచ్ఎంలు, సంబంధిత ఉపాధ్యాయుల ద్వారా డీఈవో కార్యాలయానికి పంపాలన్నారు.

రూ.13,429 కోట్లు.. 16 ప్రాజెక్టులు..!

- 16న శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- ఆయా శాఖల పనులతో తాత్కాలిక జాబితా సిద్ధం

7

శ్రీశైలం డ్యాంలో 215 టీఎంసీల నీటి నిల్వ

- ఒక గేటు ద్వారా కొనసాగుతున్న విడుదల

శ్రీశైలం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా ఉంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 884 అడుగులుగా నమోదు అయింది. వరద ప్రవాహం కొనసాగుతుండడంతో 1 గేటు నుంచి ఇంజనీర్లు స్పిల్‌వే ద్వారా దిగువ సాగర్‌కు 27,891 క్యూసెక్కుల నీటిని సాగనంపుతున్నారు. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 62,457 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి అనంతరం 45,587, సుంకేసుల నుంచి 8,892 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

తగ్గిన సాగు

- జిల్లాలో 4.22లక్షల హెక్టార్లకు 3.46లక్షల హెక్టార్లలో..
- 18 శాతం తగ్గుదల
- అధికారుల అంచనాలు తారుమారు
- కష్టాల ఖరీఫ్ ముగిసింది



ధర లేక గొర్రెలకు మేతగా ఉల్లి పంట

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈసారి ముందస్తు వర్షాలు కురిశాయి. సాధారణ విస్తీర్ణం కంటే అధికంగా పంటలు సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ అంచనాలు తారుమారై 18 శాతం పంటల సాగు తగ్గింది. ప్రస్తుత ఖరీఫ్‌లో 4,22,540 హెక్టార్లకు గానూ 3,46,495 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర పెంచడంతో పత్తి సాగు రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో ఎక్కువగా సాగైంది.

నీటిని తొలగిస్తేనే పంటకు రక్షణ



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చాలా మండలాల్లో పొలాల్లో నీరు నిల్వ ఉంది. ఈ నీటిని వెంటనే రైతులు పొలాల నుంచి బయటకు తరలించాలి. లేకపోతే తెగుళ్లు, క్రిమికీటకాలు వ్యాపించే ప్రమాదముంది.

- వరలక్ష్మి, జేడీ, కర్నూలు

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ మంగళవారంతో ముగిసింది. రైతులు వర్షాల నుంచి పంటలను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు.

పంటలు చేతికంటే సమయంలో..

పత్తి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు చేతికందే సమయం ఆసన్నమైంది. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పంటలు నీటి పాలై రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పంటలన్నీ ఇంకా నీళ్లలోనే ఉన్నాయి. పత్తి 2,19,636 హెక్టార్లు(94 శాతం) సాగైంది. పొగాకు గత సంవత్సరం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. దీంతో 2,890 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం గానూ 1,767హెక్టార్లకు పరిమితమైంది. ఉద్యాన పంటలు ఈ ఖరీఫ్‌లో 63,397 హెక్టార్లలో సాగుకావాల్సి ఉండగా 23,486 హెక్టార్లలోనే సాగైంది. మిర్చి 36,222 హెక్టార్లకు గానూ కేవలం 5,540 హెక్టార్లకే పరిమితమైంది. ఉల్లి 16,577హెక్టార్లకు గానూ, 11,056 హెక్టార్లకు సాగుచేశారు. టమోటా 2,890హెక్టార్లకు గానూ 1,767 హెక్టార్లకు పరిమితమైంది. వేరుశనగ సాగు భారీగా తగ్గింది. 54,710హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గానూ కేవలం 28,453హెక్టార్లకు పరిమితమైంది. ఆముదం మాత్రం సాధారణానికి కంటే ఎక్కువగా సాగైంది. కందులు కూడా గతేడాది మంచి ధర లభించడంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు



రూ.13,429 కోట్లు.. 16 ప్రాజెక్టులు..!

● 16న శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ ● ఆయా శాఖల పనులతో తాత్కాలిక జాబితా సిద్ధం

కర్నూలు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఈ నెల 16న కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరు అవుతున్నారు. కర్నూలు నగర శివారులో ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర రాగమయూరి వెంచర్‌లో జరిగే జీఎస్టీ-2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించే సభలో ప్రధాని మోదీ పాల్గొనబోతున్నారు. జాతీయ రహదారులు, రైల్వే, రక్షణ, పారిశ్రామిక, పవర్, ఇంధన.. వంటి శాఖ దాదాపు రూ.13,429 కోట్ల అంచనాలతో నిర్మించబోయే 16 ప్రాజెక్టులను ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అధికారులు సన్నహాలు చేస్తున్నారు. ఏపీ ప్రాజెక్టులు శంకుస్థాపన చేయాలో ఓ క్లిక్కి వచ్చినా అధికారికంగా ప్రటించాల్సి ఉంది. ఈ రెండు రోజుల్లో గుర్తించిన ప్రాజెక్టుల్లో మార్పులు చేర్పులు, కొత్తగా ఇతర ప్రాజెక్టులు కూడా చేర్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా రూ.2,786 కోట్లలో అభివృద్ధి చేయనున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. కర్నూలు పీఎస్-3 వద్ద పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం అదనపు వపర్ గ్రిడ్‌కు రూ.2,886 కోట్లతో శంకుస్థాపన చేయనున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల అంచనా విలువ రూ.5,672 కోట్లు. పక్కనే ఉన్న కడప జిల్లాలో విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి కోసం రూ.2,136 కోట్లతో టెండర్లు పలిచారు. ఈ ప్రాజెక్టుకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. ప్రధాని శంకుస్థాపన చేయబోయే ప్రాజెక్టులో మెజార్టీగా జాతీయ రహదారులు, రైల్వే శాఖ పనులు ఉన్నాయి. ఈ నెల 6న జరిగిన ఓ సమవేశంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో ప్రతిపాదించిన డ్రోన్ సిటీకి 16న ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అయితే.. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసే ప్రాజెక్టుల జాబితాలో డ్రోన్ సిటీ లేదు. తుది జాబితాలో పేరు చేరుస్తారా..? డ్రోన్ సిటీకి శంకుస్థాపన వాయిదా వేస్తారా..? అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

16న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులు, అంచనా విలువ

ప్రాజెక్టు	అంచనా విలువ (రూ.కోట్లలో)
కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి	2,786
కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి	2,136
సబ్బవరం - షీలానగర్ వరకు ఎన్‌హెచ్-516సీ 6 లైన్	964
కొత్తవలస - విజయనగరం 35 కి.మీ.లు రైల్వే లైన్	493
పెందుర్తి - సింహాచలం ఉత్తరం మధ్య రైల్వే ఫ్లైఓవర్ లైన్	184
కర్నూలు-3 వద్ద పవర్‌గ్రిడ్ టాన్స్మిషన్	2,886
ఎన్‌హెచ్-71లో పీలేరు-కాలూరు సెక్షన్ నాలుగు లైన్ల రోడ్డు	593
ఎన్‌హెచ్-1678లో కడప/నెల్లూరు సరిహద్దు - పీఎస్‌పురం వరకు 2 లైన్ విస్తరణ	286
ఎన్‌హెచ్-165లో గుడివాడ - మచిలీపట్నం మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం	98
ఎన్‌హెచ్-716లో పాపాగ్ని నదిపై 10వ ప్రధాన వంతెన నిర్మాణం	82
ఎన్‌హెచ్-565పై 11 కనిపిగి బైపాస్ నిర్మాణం	70
ఎన్‌హెచ్-544డీడీ పరిధిలో ఎన్.గుండ్లపల్లి ఫౌన్‌లో బైపాస్ సెక్షన్ మెరుగుదల	13
అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ ప్రాడక్ట్స్ ఫ్యాక్టరీ - రక్షణ ఉత్పత్తులు	362
శ్రీకాకుళం అంగుల్ నేచురల్ గ్యాస్ పైపులైన్ (మెయిన్‌లైన్)	1,730
చిత్తూరులో 15 ఎల్‌పీజీ బ్లాస్టింగ్ ప్లాంట్	200
కొత్తవలస-బొద్దవార, 33 కి.మీలు, షిమిలిగుడ-గోరపు సెక్షన్ 22 కి.మీ.లు రైల్వేలైన్	546
మొత్తం	**13,429**

వాహనాల మళ్లింపు ఇలా:

- ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఏరియాల నుంచి వచ్చే వాహనాలను నాగులాపురం దగ్గర ట్రాఫిక్ మళ్లింపు.
- బస్తిపాడు, చిన్నటేకూరు, తడకనపల్లె మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాట్లు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలి.
- డోన్, ప్యాపిలి, తుగ్గలి, పత్తికొండ ఏరియాల నుంచి వచ్చే వాహనాలు నేషనల్ హైవేకు వచ్చి తడకనపల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలి.
- కర్నూలు మీదుగా వచ్చే వాహనాలు నన్నూరు టోల్‌గేట్ దాటి తర్వాత రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి చేరుకోవాలి.
- నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె ఏరియాల నుంచి వచ్చే వాహనాలు నంద్యాల రోడ్డులో వచ్చి రాగమయూరి పార్కింగ్ దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి రావాలి.

అధికారులతో మంత్రి బీసీ సమీక్ష

బనగానపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేద్దామని ఇందుకు ప్రతి అధికారి సహకరించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. బనగానపల్లె నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధాని సభకు నియోజకవర్గం నుంచి హాజరయ్యే ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అధికారులంగా సమన్వయంతో పనిచేసి సభకు హాజరయ్యే వారికి రవాణా, ఆహారం, తాగునీటి వంటి సదుపాయాలు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సభా వేదికకు ముందుగానే చేరుకునే విధంగా అధికారులు రవాణా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ

ప్రధాని పర్యటనకు 7,300 మంది పోలీసులు

● కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు 7,300 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం భద్రతా ఏర్పాట్లపై బందోబస్తు నిమిత్తం వచ్చిన సెక్టారు పోలీసు ఉన్నతాధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి జియో గ్రాఫికల్ మ్యాప్‌ను చూపిస్తూ మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలో వారి వాహనాలను ఏర్పాటు చేసుకునే విధంగా చేయాలన్నారు. అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో ఇండికేషన్ సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అఫిషియల్స్‌కు నెంబర్ 2 పార్కింగ్ ఏరియాను కేటాయించామన్నారు. ప్రతి సెక్టారు ఇన్‌చార్జి పోలీసు ఉన్నతాధికారులకు, లైజనింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, దేవరాజ్, మాధవ రెడ్డి, దీపికా పాటిల్, జి.కృష్ణకాంత్, కృష్ణకాంత్ పటేల్, శ్రీనివాసరావు, మణికంఠ చందవోలు, ధీరజ్ కునుబిల్లి, షెల్కే నచికేత్ విశ్వనాథ్, చక్రవర్తి, లక్ష్మి నారాయణ, ట్రైనీ ఐపీఎస్‌లు, అడిషినల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అదుపుతప్పి కంటైనర్ బోల్తా

అవుకు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణం సమీపంలోని కొత్తకాల్వ వద్ద కంటైనర్ అదుపుతప్పి ఆదివారం బోల్తా పడింది. విజయవాడ నుంచి హిందూపురం వెళుతున్న కంటైనర్ అవుకు సమీపంలోని కొత్తకాల్వ దగ్గరకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

తమ్ముడి పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ...

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తన తమ్ముడి పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ ప్రమాదవశాత్తూ అన్న మృత్యువాత పడిన సంఘటన కర్నూలు-చిత్తూరు రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... జాతీయ రహదారిపై ఓర్వకల్లు గ్రామ సమీపాన ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ రఫీ (35) ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు హైదరాబాదు నుంచి స్వగ్రామమైన కాల్వకు వస్తుండగా.. ఓర్వకల్లు గ్రామ సమీపాన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుని తమ్ముడికి ఈ నెల 15న వివాహం జరగాల్సి ఉండగా.. పెండ్లి పత్రికలు తీసుకెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చిప్పగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన శివకుమార్(36) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. అనంతపురం జిల్లా గుంతకల్లులో పొలంలో ద్విచక్ర వాహనంతో పాటు శివకుమార్ పడి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శివకుమార్ మృతిపై ఆరా తీస్తున్నారు. నంచర్ల గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం పూజారిగా ఉన్న శివకుమార్ తల్లిదండ్రులు పూజలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. శివకుమార్‌కు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఆళ్లగడ్డ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం గూబగుండం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మజీద్ హుసెన్(40) అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కమలాపురానికి చెందిన పిచ్చిరెడ్డి తిరుపతి మారుతి కార్ షో రూంలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో హైదరాబద్‌లో కారు డెలవరీ ఇచ్చేందుకు తిరుపతి నుంచి బయలు దేరాడు. కడప వద్ద ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఆళ్లగడ్డ మండలం గూబగుండం వద్దకు రాగానే నిద్రమత్తులో చెట్టుకు అతి వేగంగా ఢీకొన్నాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న కడప జిల్లాకు చెందిన ప్యాసింజర్ మజీద్ హేసెన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పిచ్చిరెడ్డితోపాటు మరో ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం పోలీసులు ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి పంట అగ్నికి ఆహుతి

15 క్వింటాళ్లు నష్టం



చిరుమాన్ దొడ్డిలో కాలిపోయిన పత్తి

ఆస్పరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి అమ్మకానికి సిద్ధంగా ఉన్న సమయంలో పత్తి అగ్నికి ఆహుతైన ఘటన ఆదివారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల చంద్రశేఖర్ తనకున్న మూడు ఎకరాల పొలంలో పత్తి పంటను సాగుచేసి ఎకరాకు దాదాపుగా రూ.50 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. తీరా చేతికొచ్చి అమ్మాల్సిన సమయంలో దగ్ధమైంది. దాదాపుగా ఇంట్లో ఉన్న 15 క్వింటాళ్ల పత్తి అగ్గిలో కాలి బూడిదైంది. దీంతో రైతు తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం యాదవాడకు చెందిన అరుణ్‌కుమార్ అనే యువకుడు కడప జిల్లా దువ్వూరు వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యాదవాడకు చెందిన అరుణ్‌కుమార్(19) స్థానిక ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికతో ప్రేమాయణం సాగించేవాడని స్థానికుల సమాచారం. ఈ విషయం బాలిక బంధువులకు తెలిసి ఇటీవల అరుణ్‌కుమార్ ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశారు. దీంతో అరుణ్ కుమార్ తండ్రి మందలించడంతో ఇంటి నుంచి పరారయ్యాడు. ఆదివారం కడప జిల్లా దువ్వూరు సమీపంలో ఓ రేకుల షెడ్డులో ఉరి వేసుకుని యువకుడు మృతి చెందాడు. ఈ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కాళ్లు భూమికి అందేలా ఉండటం, ప్యాంట్ కిందికి జారి ఉండడంపై అనుమానం వ్యక్తం చేశారు. కడప జిల్లా దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

బేతంచెర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పెండేకల్ గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య కుమారుడు చిన్న కుల్లాయి (25) అనే యువకుడు గ్రామ సమీపంలోని బావిలోకి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. గల్లంతైన చిన్న కుల్లాయి కోసం పోలీసులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఈతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో గ్రామస్థులు బావి వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. బావిలోని నీటిని డీజిల్ మోటారు ద్వారా తోడేస్తున్నారు. ఇంకా యువకుడి ఆచూకీ దొరకలేదని పోలీసులు తెలిపారు.

1 నుంచి కర్నూలు ఉత్సవ్

● తొలిసారిగా వారం రోజుల పాటు రాష్ట్ర అవతరణ సంబరాలు

● టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



సమావేశంలో మాట్లాడుతున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చారిత్రక వైభవం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య అంశాలను మేళవిస్తూ వారం రోజుల పాటు 'కర్నూలు ఉత్సవ్' పేరిట భారీ కార్యక్రమానికి టీజీవీ కళాక్షేత్రం సంకల్పించింది. ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా నవంబరు ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు టీజీవీ కళాక్షేత్రంలో ఆధ్వర్యంలో 'కర్నూలు ఉత్సవ్' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఆదివారం కళాక్షేత్రంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్, పారిశ్రామికవేత్త టీవీ రెడ్డి, విద్యాసంస్థల అధినేతలు రవీంద్ర, జి.పుల్లయ్య, మాంటిస్సోరి రాజశేఖర్ సూచనల మేరకు సాంస్కృతిక, చారిత్రాత్మక, సాహిత్య, జానపద అంశాలను వెల్లడించే విధంగా ఈ ఉత్సవానికి కార్యాచరణ రూపొందించామన్నారు. గతంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వేడుకలు జరగలేదని, ఇదే ప్రథమమని తెలిపారు. ఇందుకోసం డీఐజీ, కలెక్టర్, ఎస్పీల సహకారం తీసుకుంటామన్నారు. కర్నూలు ఖ్యాతిని పెంచేలా ఉన్న ఈ ఉత్సవాల్లో అధికారులు, ప్రభుత్వం కూడా పాలుపంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, ప్రతినిధులు పి.రాజారత్నం, మహమ్మద్ మియా, గాండ్ల లక్ష్మన్న, ఎన్‌వీ రమణ, లక్ష్మీకాంతరావు, ఈశ్వరయ్య, చంద్రకంటి మద్దయ్య, పీపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'కర్నూలు ఉత్సవ్' ఇలా..

- టీజీవీ కళాక్షేత్రంలో నవంబరు 1న సాయంత్రం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి, అనంతరం నగరంలోని నృత్య గురువుల ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు.
- నవంబరు 2న ఉమ్మడి జిల్లా కళాకారులతో జానపద నృత్య సంగీత ప్రదర్శనలు.
- నవంబరు 3న ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, కవయిత్రులతో కవి సమ్మేళనం.
- నవంబరు 4న ఉమ్మడి జిల్లా సాహిత్యవేత్తలు, రచయితలతో సాహిత్య సభ,
- నవంబరు 5న 'ఆంధ్ర రాష్ట్ర అవతరణ-మొదటి రాజధాని కర్నూలు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు.
- నవంబరు 6న అంతరించిపోతున్న తోలుబొమ్మలాట, బుర్రకథ, హరికథ ఇతర ప్రదర్శనలు
- నవంబరు 7న ఔత్సాహిక పౌరాణిక కళాకారులతో ఏకాంకిక నాటక ప్రదర్శనలు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగుతాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖుల ఛాయాచిత్ర ప్రదర్శన వారం రోజులు కళాక్షేత్రంలో కొనసాగుతుంది.

అమ్మను వదిలేసిన కొడుకులు

● రోడ్డు పాలైన వృద్ధ తల్లి

● అక్కున చేర్చుకున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కని, పెంచిన పిల్లలే తల్లి వృద్ధురాలైందని రోడ్డున వదిలేశారు. మూడు రోజులుగా దిక్కులేకుండా ఆకలితో అలమటిస్తున్న ఆ వృద్ధురాలు చూసి పట్టణంలోని జీవనజ్యోతి ఆశ్రమానికి సమాచారం ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకుడు పాస్టర్ విక్టర్ పాల్ ఫిలిప్ (72) ఏళ్ల వృద్ధురాలని అక్కున చేర్చుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన బేగారి లక్ష్మమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉందని ఆమె తెలిపిందని అన్నారు. ఆమెకు ఆరోగ్యం బాలేకపోతే రాయచూర్ నుంచి ఆదోనికి ఆసుపత్రిలో చూపిస్తామని కుమారులు తీసుకొచ్చారన్నారు. కుమారులు రంగా, రమేష్ బసప్ప మాటలు విని వృద్ధురాలు నరసమ్మ ఆదోనికి చేరుకుంది. ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలోని మెడికల్ షాప్ వద్ద ఆమెను కుమారులు వదిలేసి వెళ్లారు. మూడు రోజులుగా ఆకలితో అలమటిస్తున్న వృద్ధురాలిని మెడికల్ షాప్‌లో పనిచేసే వలి తమకు సమాచారం ఇచ్చారన్నారు. హిందీ ఉపాధ్యాయుడు నరసయ్య మానవత్వంతో భోజనం అందించారు. ఆశ్రమ నిర్వాహకుడు ఫిలిప్ అక్కున చేర్చుకుని ఆశ్రమానికి తీసుకెళ్లి మానవత్వం చాటుకున్నారు. ఆరోగ్యం బాగా లేకపోతే వైద్యునితో చికిత్స చేస్తున్నట్లు తెలిపారు.



వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకెళ్తున్న నిర్వాహకులు

గూడు చెదిరి.. తరువు కింద చేరి..!



చెట్టుకింద చెక్క పెట్టెలో నివాసం

తన అనుకున్న వారు ఉన్నా రెక్కల తెగిన పక్షిలాగా ఒంటరైంది.. గూడు చెదిరి.. తరువే(చెట్టు) ఆవాసమైంది. వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ.. చలికి వణుకుతూ.. భద్రత కరువై.. బతుకు బరువై దీనావస్థలో 15ఏళ్లుగా కొట్టుమిట్టాడుతోంది మంత్రాలయానికి చెందిన పద్మమ్మ. పెద్దలింటి భీమయ్య, నరసమ్మ దంపతులకు ఏడుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. వీరిలో పద్మమ్మను కర్ణాటకలోని రాయచూరు జిల్లా వీరాపురం ఇచ్చి పెళ్లి చేశారు. అక్కడి పరిస్థితి బాగా లేకపోవడంతో పద్మమ్మ, భర్త నాగేంద్రప్ప కొన్నేళ్ల క్రితం మంత్రాలయం వచ్చేశారు. వీరికి సంతానం లేదు. అనారోగ్యంతో భర్త నాగేంద్రప్ప మృతిచెందాడు. ఆమె ఒంటరి దైంది. అక్క, అన్న, తమ్ముళ్లు, చెల్లెలున్నా వారి ఇంటికి వెళ్లేందుకు ఆమె మనసు ఒప్పడం లేదు. చెట్టు కిందే ఓ బల్ల చెక్కతో గూడు ఏర్పాటుచేసుకుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చే రూ.4వేలు పింఛన్, 5కేజీల బియ్యం, మూడిళ్లలో పనులు చేస్తూ నెలకు వచ్చే రూ.1,500తో నెట్టుకొస్తుంది. 1998లో పురపాలక శాఖ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి ఆమెకు రాఘవేంద్రపురంలో రెండు సెంట్ల స్థలమిచ్చారు. అక్కడ పూరి గుడిసె ఏర్పాటు చేసుకొని నివాసముండేది. గుడిసె కూడా కూలిపోయింది. కర్ణాటక గెస్టు హౌస్ మైదానంలో ప్రహరీవద్ద ఉన్న చెట్టు కిందే ఒక మూలన బల్ల ఏర్పాటుచేసుకొని జీవిస్తోంది. చిన్న వయసులో భర్తను కోల్పోయి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లలేక చెట్టుకిందే కాపురముంటూ అనాథగా జీవిస్తుంది. పాలకులు, అధికారులు స్పందించి తనకు ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆమె కన్నీటి పర్యంతమవుతుంది.

● మంత్రాలయం, ఆంధ్రజ్యోతి



అంట్లు తోముకుంటున్న బారికి పద్మమ్మ

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గురుశేఖర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారుల రాజకీయ శిక్షణ తరగుతులను జయప్రదం చేయాలని ఏపీ రజక వృత్తిదారుత సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ అన్నారు. ఆదివారం న్యూసిటి అధ్యక్షుడు సి.రాముడు అధ్యక్షతన కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 1,2 తేదీలలో నెల్లూరు జిల్లా జక్కా వెంకయ్య భవనంలో జరిగే చైతన్య తరగతులను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి సీహెచ్.శ్రీనివాసులు, కారర్యదర్శి శేషాద్రి, నాయకులు సి.ఎల్లయ్య, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న పీపీఎస్ఎస్ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగర శివారు సంతోష్ నగర్ సమీపంలోని రహమత్ నగర్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కాలనీలో కమిటీ సభ్యులు పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో లైట్లు వెలగడం లేదని, ఫ్యాన్లు తిరగడము లేదని..త్రాగునీటి మోటార్లు పని చేయడం లేదని స్థానికులు కమిటీ సభ్యులు దృష్టికి తీసుకువచ్చారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యల వల్ల లైట్లు వెలగకపోవడం, ఫ్యాన్లు తిరగకపోవడం జరుగుతుందన్నారు. విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయని అన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ఆర్ షఫిఉల్లా, గులాం హుస్సేన్, ఆర్ రోషన్, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో నగర పాలక అధికారులు, సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమైనందున సోమవారం నగర పాలక కార్యాలయంలో జరగాల్సిన ప్రజాఫిర్యాదుల స్వీకరణ రద్దు చేసినట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ స్థానిక సమస్యలు లేదా ఫిర్యాదులను కేఎంసీ హెల్ప్‌లైన్ నెంబర్ 7422992299కు వాట్సాప్ లేదా కాల్ చేయాలని సూచించారు. తదుపరి సోమవారం నుంచి ప్రజా ఫిర్యాదు పరిష్కారం వేదిక కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

● నగర పాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కర్నూలులో 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఉందని, నగర పాలక అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా రహదారుల మరమ్మతు పనులు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, సైన్ బోర్డులు, దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, పారిశుధ్య చర్యలు, మొబైల్ టాయిలెట్లు, స్నాక్స్ హెల్ప్ డెస్క్ ఏర్పాట్లపై పూర్తిస్థాయి దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ప్రతి విభాగం అధికారులు తమ పనులు సమయపాలనతో పూర్తి చేసి, సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పర్యటనకు వివిధ మున్సిపల్ సిబ్బంది

ఈ నెల 16న శ్రీశైలంలో జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా వివిద మున్సిపల్ కమిషనర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొనాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డా.పి.సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఈ నెల 14న మూడు కార్పొరేషన్లు(కర్నూలు,అనంతపురం,కడప), 16 మున్సిపల్ కమిషనర్ల పరిధిలోని సుమారు 600 మంది శానిటేషన్ సిబ్బంది, 80 మంది శానిటేషన్ సూపర్‌వైజర్లు కర్నూలు నగర పాలక కమిషనర్‌కు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధాన పర్యటనలో భాగంగా సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు శానిటేషన్ పనులు నిర్వహణ బాధ్యతలు సంబంధిత కమిషనర్లు, సూపర్‌వైజర్లకు అప్పగించినట్లు తెలుస్తోంది.



రోడ్లు వేస్తున్న దృశ్యం



సభా ప్రాంగణం సిద్ధం



ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి భరత్



ట్యాబ్‌లో మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



బందోబస్తుపై పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ

ఏర్పాట్లు ముమ్మరం

కర్నూలు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 16న శ్రీశైలం, కర్నూలుకు రానున్నారు. ఉదయం జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అక్కడి నుంచి కర్నూలు నగర శివారున ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర రాగమయూరి వెంచర్‌లో నిర్వహించే 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఆదివారం మంత్రి టీజీ భరత్, ఎస్పీ, కలెక్టర్, జేసీ, వివిధ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పనులను దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

పల్లాకు టీడీపీ శ్రేణుల ఘన స్వాగతం

జిల్లా పర్యటనకు వచ్చిన పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ అతిథి గృహంలో ఎంపీ నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, నాగేశ్వరరావు యాదవ్, కడప ఆర్టీసీ జోన్ చైర్మన్ పూల నాగరాజు, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, డైరెక్టర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి రాగమయూరి పరిసరాల్లో ప్రధానీ మోదీ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లారు. అంతక ముందు ఆయనకు పూల బోకే ఇచ్చిశాలువతో సత్కరించారు.



పల్లా శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు



పల్లా శ్రీనివాసరావును కలిసిన టీడీపీ నాయకులు

చికెన్ ధర రూ.100

● పోటీ పడి ధరలు తగ్గించిన వ్యాపారులు
● మాంసం ప్రియులు ఖుషీ



కిలో చికిన్ ధరలు రూ.100 బోర్డులు

కోడుమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణంలో చికెన్ వ్యాపారస్తుల మధ్య నెలకొన్న పోటీ వల్ల కిలో చికెన్ ధర తగ్గించారు. ఆదివారం పట్టణంలో కిలో చికెన్ రూ.100లకే విక్రయించారు. స్కిన్ లెస్ రూ.120లకే విక్రయించారు. తగ్గిన చికెన్ ధరలను చూసి చికెన్ ప్రియులు ఖుషీగా చికెన్ కోసం పరుగు తీశారు. కొత్తబస్టాండ్‌లో అబ్దుల్లా చికెన్‌సెంటర్‌లో గత వారం స్కిన్‌తో కిలో రూ.120, స్కిన్ లెస్ రూ.140 విక్రయించారు. పట్టణంలోని దస్తగిరి చికెన్ సెంటర్ యాజమాన్యం ఆదివారం ఉదయం కిలో రూ.100 బోర్డును తగిలించాడు. పోటీని ఎదుర్కొనేందుకు స్కిన్‌తో కిలో రూ.100 అంటూ మరి కొంత మంది వ్యాపారస్తులు బోర్డులు తగిలించారు. దీంతో ప్రజలు తగ్గిన చికెన్ కోసం బారులు తీరారు. మిగిలిన వ్యాపారసులు స్కిన్‌తో రూ.180, స్కిన్ లెస్ రూ.200లకు విక్రయిస్తే తప్ప మాకు గిట్టుబాటు కాదని ధరలు తగ్గించలేక పోయారు. ధరలు తగ్గించని చికెన్ సెంటర్ల దగ్గర చికెన్ ప్రియులు లేక వ్యాపారాలు వెలవెలబోయాయి.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలి

● పొదుపు సంఘాలు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష
● కల్లూరు అర్బన్ వార్డు నాయకుల సమావేశంలో గౌరు చరితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భారతప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనను సమన్వయంతో పనిచేసి జయప్రదం చేద్దామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు మున్సిపల్ సమావేశ భవన్‌లో ఎమ్మెల్యే పొదుపు మహిళా సంఘాలు, సచివాలయ ఉద్యోగులు, కల్లూరు అర్బన్ 16 వార్డుల టీడీపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ యువనేత గౌరు జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ 2.0 పై మొట్టమొదటి సారి కర్నూలుకు వస్తున్న మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పొదుపు మహిళలు ప్రధాని సభలో తప్పకుండా పాల్గొనాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు వారి విధులను సక్రమంగా పాటించి సభ విజయవంతమయ్యేలా పని చేయాలన్నారు. కర్నూలు జిల్లా అంటే క్రమశిక్షణకు మారుపేరని, ప్రపంచ వ్యాప్తంగా భరతదేశ ప్రతిభను చాటి చెబుతున్న మోదీ సభకు బాధ్యతగా పనిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవ పరిణామం నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న డాక్టర్ కాలేషా బాషా

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవ పరిణామం అన్నది నిరంతర ప్రక్రియ అని, మనిషి మూలాలన్ని ఆఫ్రికన్ నుంచే బయలుదేరి కొన్నివేల సంవత్సరాల తర్వాత ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జనరల్ సర్జన్ డా.కాలేషా బాషా అన్నారు. నగరంలోని డా.బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం వైద్య విద్యార్థులకు జరుగుతున్న హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైన్స్ ప్రపంచ మానవాళి మూలం. ఒక చోట నుంచి బయలుదేరిందని, ఇది అందరూ ఒక్కటేనన్నారు. శాస్త్రీయ ఆధారాలతో చెబుతుంటే కులాలు, మతాలు ప్రాంతాల పేరుతో ప్రజలు విడదీయబడుతున్నారని తెలిపారు. మనుషులు కులాలు, మతాల ప్రాంతాలు వారీగా విడిపోవడం అందులో మాత్రమే పెళ్లిల్లు చేసుకోవడం ద్వారా మానవాళి జీన్స్ అక్కడిక్కడే తిరుగుతూ అభివృద్ధి చెందడం లేదని, ఇది దేశానికి నష్టం చేస్తుందన్నారు. జేవీవీ వ్యవస్థాపకులు డా.వీ.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలను వైద్యులు గౌరవంగా చూడాలని సూచించారు. సమాజంలో కార్పొరేట్ శక్తులు వైద్య రంగంలో విచ్చలవిడిగా వస్తున్నారని, సామాన్యులకు అందుబాటులో ఉండే చిన్న ఆసుపత్రులు కార్పొరేట్ దెబ్బకు విలవిలలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంటు బర్మా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శేషాద్రిరెడ్డి, రాష్ట్ర నాయకులు మహ్మద్ మియా, గోపాల్ నాయక్, రమణయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, రామఫక్కీరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలులో పీఆర్‌టీయూ నాయకుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో కరువు భత్యం చెల్లిస్తున్నా కేంద్రంలోని కూటమి సర్కార్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువుభత్యం విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులను ఒక రీతిలో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మరో రీతిలో డబుల్ ఇంజన్ సర్కార్ ధోరణి మారాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థికపరమైన అంశాలతో పాటు మెడికల్ బిల్స్, సరెండర్ లీవ్స్, గ్రాట్యుటీ చెల్లించాలని, లేనిపక్షంలో పీఆర్‌టీయు రాష్ట్ర నాయకత్వం ద్వారా కలిసి వచ్చే సోదర సంఘాలతో ఉద్యమకార్యచరణకు శ్రీకారం చుడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రధానకార్యదర్శులు, ధనుంజయ, చాంద్‌బాషా, భాస్కర్ రెడ్డి, రవిప్రకాష్, సుమంత్, మాధవరెడ్డి, కేవీ రమణయ్య పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల హామీని తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న కె.ప్రభాకర్

కల్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఈనెల 4న ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో సీఐటీయూ మండల కార్యదర్శి మధు ఆధ్వర్యంలో చేపట్టిన ఆటోడ్రైవర్ల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కె.ప్రభాకర్ మాట్లాడుతూ 4న విజయవాడలో ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించిన కుటమి ప్రభుత్వం జీఓ 21 రద్దు చేస్తానని, సంక్షేమ బోర్డు ఏర్పా చేస్తానని మామీ ఇచ్చారని వెంటనే వాటిని అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బొగ్గులబాషా, నరేష్, శేఖర్, సుంకన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి

సి. బెళగల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దీపావళికి బాణాసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ పరమేష్‌నాయక్ కిరాణం దుకాణం యజమానులను సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో కిరాణం దుకాణుదారులతో సమావేశమయ్యారు. అనుమతి లేకుండా విక్రయిస్తే దుకాణం యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలకల్లు, కొత్తకోట, ముడుమాల, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి, కంబందహల్, మారందొడ్డి గ్రామాలలో పర్యటించి పలు సూచనలు చేశారు.

చైనా బాణసంచాను నిషేధించిన ప్రభుత్వం



గూడూరులో శాంతియుత మౌన నిరసన తెలుపుతున్న దృశ్యం

గూడూరు అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చైనా బాణసంచాను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు అన్నారు. ఆదివారం గూడూరులో పాత బస్టాండ్ సర్కిల్‌లో భజరంగ్‌దళ్ రాష్ట్ర గోరక్ష ప్రముఖ్ రాజేష్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో శాంతియుత మౌన నిరసన చేపట్టారు. మల్లేష్ నాయుడు మాట్లాడుతూ భారత ప్రభుత్వం చైనా బాణసంచాను నిషేధించిందని అందులో విష పదార్థాలు అధికంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా విద్యార్థి కన్వీనర్ రాము, శివరాముడు, పోన్నకల్ వెంకటేష్, నవీన్ వేదవ్యాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐడీఎస్‌వో కర్నూలు నగర కన్వీనర్ మల్లేష్ ప్రభుత్వాన్ని ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయని.. మరికొన్ని హాస్టల్‌లో పరిస్థితి కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. మెస్ చార్జీలు పెంచి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆవోపా ఆధ్వర్యంలో అన్నదానం



అమీన్ హైదర్ ఖాన్ నగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఆవోపా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అన్నపూర్ణమ్మగా పేరు ప్రఖ్యాతులు గడించిన డొక్కా సీతమ్మ జయంతిని పురస్కరించుకొని, ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కర్నూలు శాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నగరంలోని అమీన్ హైదర్‌ఖాన్ నగర్‌లోగల పేద వర్గాలకు అన్నదానం చేశారు. డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. పేద వర్గాలకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు పి. లక్ష్మీనారాయణ, ఆవోపా చీఫ్ ఎం. నాగేశ్వరరావు, కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

'ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి'



ఆవోపా ప్రతినిధులతో సత్కారం అందుకున్న ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవ చేసి, ప్రజల మన్ననలు పొందాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కర్నూలు శాఖ అధ్యక్షుడు డాక్టర్ పి. లక్ష్మీనారాయణ, చాఫ్ కన్వీనర్ ఎం. నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని సుంకేసుల రోడ్డులో సమీపంలోని ఆవోపా సేవా సదన్‌లో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఏడుగురు ఆర్యవైశ్య యువతీ యువకులను ఆవోపా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల ద్వారా ప్రజలకు సేవ చేయడం గొప్ప అదృష్టమని, ఉద్యోగులు అందించే సేవలతో ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం అవుతాయని తెలిపారు. భావి పౌరులను తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు.

నేడు క్రీడా ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో డీఎస్ఏ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల బాలబాలికలకు క్రికెట్, యోగా ఆసనాలు, బేస్‌బాల్ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. 1.1.2007 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. వివరాలకు 944084732ను సంప్రదించాలన్నారు.

ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షుడిగా నాగరత్నమయ్య

ఏపీ రాష్ట్ర ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షుడిగా కర్నూలు వాసి నాగరత్నమయ్యను ఎన్నుకున్నారు. ఆదివారం విశాఖపట్నం రాయల్ ఫోర్ట్ హోటల్ ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ సంఘం ఎన్నిక జరిగింది. ఏపీ ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షులుగా నందమూరి తేజశ్విని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యక్రమం బీవీ రమణను ఎన్నుకున్నారు.

మండగిరి పంచాయతీ కార్యదర్శికి పదోన్నతి


చంద్రశేఖర్

ఆదోని రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండల మండగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు డిప్యూటీ ఎంపీడీవోగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలచ అధికారులు చంద్రశేఖర్‌కు డిప్యూటీ ఎంపిడీవోగా నంద్యాల జిల్లాకు అటాచ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆదోని మండల కార్యాలయ ఏవో నాగస్వామి, ఎంపీడివో జనార్ధన్ సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. పదోన్నతి కల్పించిన ప్రభుత్వానికి చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

జీపు జాతా విజయవంతం

ఆదోని టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా సాధన కోసం ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలలో నిర్వహించిన ప్రచార జీపు జాతా కార్యక్రమం విజయవంతమైందని ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్‌అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మూడు నియోజకవర్గాల పర్యటనలో జిల్లా సాధన కోసం సిద్ధం కావాలని పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో పర్యటించాల్సి ఉందన్నారు. ప్రచార యాత్ర విజయవంతానికి కృషి చేసిన సభ్యులు నరేంద్రయాదవ్, కుబేర స్వామి, సద్దాం హుస్సేన్, పరమేష్, షకీల్, హఫీజ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు


భగవద్గీత పోటీలలో రాణించిన వారితో చిన్మయ మిషన్ స్వామీజీ

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిన్మయ మిషన్ అమృత్యోత్సవాల్లో (75 ఏళ్లు) భాగంగా ఆదోని జిల్లాస్థాయి భగవద్గీత పఠన పోటీలను ఆదివారం నిర్వహించారు. ఫైనల్ విజేతల అయిన వారికి బహుమతులను ప్రదాన చేశారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ ఆచార్యులు బ్రహ్మచారి నారాయణ చైతన్య మాట్లాడుతూ భగవద్గీత జీవితంలోని ప్రతి సమస్యకు సమాధానం ఇస్తుందని ప్రతి ఒక్కరు ప్రతిరోజు భగవద్గీతను పఠనం చేయాలని సూచించారు. ఆరు గ్రూపులలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. మొదటి బహుమతి సాత్విక్ సాయి గ్రూపుకు రెండవ భహుమతి రిషి వశిష్ట మూడవ బహుమతి భవాని ప్రియా గ్రూపుకు అందజేశారు. అధ్యక్షుడు ఏగాటి ప్రతాప్ కోఆర్డినేటర్లు సుజాత, రఘునాథ్, శ్రీనివాస్ జగదీష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

క్రిష్ణగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సుంకులమ్మ పునప్రతిష్ట గుడి నిర్మాణానికి దాతలు సహకరించాలని బోయ బొంతిరాళ్ళ సర్పంచ్,న్యాయవాది రవి మోహన్ అన్నారు.గ్రామంలో నిర్మిస్తున్న గుడి నిర్మాణానికి ఆదివారం కుటుంబసభ్యులతో కలసి 50వేలు విరాళం అందించారు.గుడి నిర్మాణానికి గ్రామస్తులందరు కులమతాలకతీతంగా సహకరించాలని కోరారు .రాజశేఖర్, మల్లిఖార్జున, రామాంజనేయులు, నగరి బాలరాముడు, నాగరాజు, భవాదిత్య, కృష్ణమూర్తి, రాంబాబు, రాజు, శివరాజు పాల్గొన్నారు.

17న స్వర్ణామృత ప్రాశనం పంపిణీ

ఆదోని టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన స్వర్ణామృత ప్రాశనం ఔషధాన్ని 15వ తేదీన చిన్నారులకు పంపిణీ చేయనున్నట్లు ఆవోపా సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు అనేక రోగాల భారీ నుండి తప్పించి, జ్ఞాపక శక్తిని పెంపొందిస్తూ, సర్వరోగ నివారిణీలా పని చేసే ఈ ఔషధాన్ని పంపిణీ 17వ విడత నిర్వహిస్తున్నామని అన్నారు. 16 ఏళ్ల లోపు చిన్నారుల కోసం నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

తుగ్గలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంతంలో నివసించే గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తామని ట్రైబల్ వెల్ఫేర్ ప్రభుత్వ రాష్ట్ర సలహా మండలి సభ్యులు వెంకటపతి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో జీవిస్తున్న గిరిజనులకు ఆర్థికంగా ఎదిగేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, ు. ముఖ్యంగా మైదాన ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా రిజర్వేషన్లు కల్పిస్తే రాజకీయంగా కూడా ఎదుగుతారన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

వెల్దుర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకేజీ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వడ్డె అనిల్‌ను ఆదుకోవాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాలుబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు సర్వజనవైద్యశాలలో చికిత్స పొందుతున్న వడ్డె అనిల్‌ను పరామర్శించారు. బాలుడు అనిల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్‌లో గ్యాస్ ఏజెన్సీ వారు చికిత్స చేయించాలని అన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా గ్యాస్ ఏజెన్సీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహేశ్, అశోక్, వెంకటేశ్, శ్రీను, శ్రావణ్ పాల్గొన్నారు.

'నా భూమిని ఇతరులకు రాసిచ్చారు'

మద్దికెర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పూర్వం నుంచి నా ఆధీనంలో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు సర్వేయర్లు ఇతరులకు రాసిచ్చారనీ మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన రైతు జిట్ట ఆంజనేయులు ఆరోపించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఖాతా.నెం.1318, సర్వే.నెం.607/2డిలో నాలుగెకరాల 76 సెంట్ల భూమి ఉందని, అయితే.. గత కొన్ని నెలల క్రిందట హంపా రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బొమ్మనపల్లి భూములను రీసర్వే చేశారనీ, సంబంధిత వీఆర్వో, సర్వేయర్ కలిసి ఆ సర్వేనెంబరులో నాకు కేవలం 3 ఎకరాల 77 సెంట్ల భూమి మాత్రమే ఎక్కించారనీ, మిగతా భూమి ఎక్కించలేదని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పలుమార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. మా భూమి మాకు ఇవ్వడానికి కాలయాపన చేస్తున్నారనీ అన్నారు. రెవెన్యూ అధికారులు ఎంతో విలువ చేసే భూమిని వేరే వారి పేరు మీద ఎక్కించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నా భూమిని ఆన్‌లైన్ చేయకపోతే ఆందళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై తహసీల్దార్ గుండాల్ నాయక్‌కు వివరణ కోరగా రీసర్వేలో పరిశీలించి న్యాయం చేస్తామని వివరణ ఇచ్చారు.

వైభవంగా మాళ మల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

వేడుకలకు హాజరైన ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే శ్యాంబాబు


పట్టణంలో భీరప్పస్వాములు ఊరేగింపు


వేడుకల్లో ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో నూతనంగా నిర్మించిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం భీరప్ప డోలులు, భీరప్పస్వాముల ఊరేగింపు సందడితో వైభవంగా జరిగాయి. పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న గాంధీనగర్‌లో మాల మల్లేశ్వరస్వామి నూతన ఆలయాన్ని రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించారు. మూడు రోజులుగా ఆలయ ప్రతిష్ఠ వేడుకల సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు, ప్రతిష్ఠ వేడుకలు, వేద పండితుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకుని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భీరప్పస్వాములవిగ్రహాలు) స్థానిక గోపాల్ ప్లాజా సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద స్వాములకు గంగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపూజ అనంతరం స్వాములవారిని అశేష భక్త జనం మధ్య భీరప్ప డోలు వాయిస్తూ స్వాములవారిని ఊరేగించారు. అనంతరం నూతన ఆలయం వద్దకు చేరుకున్న భీరప్పస్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుల గురువులు పీఠాధిపతులు, ఘణకార్యులు ఆశీర్వదించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి, ప్రముఖ పారిశ్రామికవేత్త బత్తిన లకి&నారాయణ, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర నాయకులు బత్తిన లోకనాథ్, హోటల్ శ్రీను, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, కురువ సంఘం నాయకులు సోమలింగ, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ ధర్నా

మద్దికెర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంపై సోమవారం ఉదయం పత్తికొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవమ్మ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యులు డి.మురళిధర్ రెడ్డి, వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రేలంపాడు వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షులు రేలంపాడు వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణ, ఉప సర్పంచ్ కృష్ణా యాదవ్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యంపై వైసీపీ ఆధ్వర్యంలో పోరు కార్యక్రమానికి మండల వైసీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామంలో బసవరాజు అనే ఉపాధ్యాయుడు పై విద్యార్థి తండ్రి రంగస్వామి దాడి చేయడం అమానుషమని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న అన్నారు. ఆదివారం ఎస్టీయూ ప్రాంతీయం కార్యాలయంలో ఆదోని కౌతాళం ముఖ్యనాయకుల సమావేశం ఉపాధ్యాయుడు అంజనేయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు పైనే విద్యార్థి తండ్రి దాడి చేసి గాయపరచడం మంచిది కాదన్నారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు స్వాగతం తెలుపుతూన్నామని పాఠశాల అభివృద్ధి కొరకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రామాంజినేయులు, శేక్షావలి, సుధాకర్, వేణుగోపాల్, లక్ష్మన్న, రాజా నాయక్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్రాముడు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని 42 మంది బాధితులకు రూ.30లక్షల 30 వేల విలువైన చెక్కులను ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాడని, అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

టమోటా రైతులను ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన టమోటాలను కిలో రూ.25 ప్రకారం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్రలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న టమోటా మార్కెట్‌ను సీపీఎం బృందం సందర్శించింది. అనంతరం మార్కెట్‌యార్డు సెక్రటరీ, స్పెషల్ అధికారుల దృష్టికి టమోటా రైతుల సమస్యను తీసుకెళ్లారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమోటా రూ.3 కూడా కొనుగోలు చేయడం లేదని, దీంతో టమోటా రైతులు తీరని నష్టాలను చవి చూడాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కిలో టమోటాను రూ.25 ప్రకారంగా కొనుగోలు చేయాలన్నారు. లేనిపక్షంలో టమోటా రైతులకు న్యాయం జరిగేంతవరకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నార ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, గంగన్న పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న ప్రశాంతి


గాయపడ్డ విజయ్‌కుమార్

మద్దికెర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.అగ్రహారం పరిసర ప్రాంతాల్లో గుంతకల్లు పట్టణానికి చెందిన ఏ.విజయ్ కుమార్, ఏ.ప్రశాంతి ద్విచక్రవాహనంలో జొన్నగిరికి బైక్‌పై వెళ్తుండగా.. ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన చందోలి రవి అనే వ్యక్తి వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో విజయ్‌కి చేయి విరిగిపోగా.. ప్రశాంతికి తీవ్ర గాయాలు కావడంతో గుంతకల్లు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంతకల్లు పట్టణానికి చెందిన ఏ.విజయ్, ప్రశాంతి ఈ ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్యశిబిరాలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఈ నెల 9న మండలంలోని జొన్నగిరి, పెరవలి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఆ ప్రాంతానికి వెళ్తుండగా.. ఎం.అగ్రహారం చెందిన చందోలి రవి వీరి వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కావడంతో.. వాహనం పూర్తిగా దెబ్బతింది. అయితే ఇరువురిని గుంతకల్లు ప్రైవేటు వైద్యశాలకు స్థానికులు తరలించారు. అందులో ప్రశాంతి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులైన తమను పోలీసులు ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగి నాలుగు రోజులైనా పోలీసులు ఎలాంటి విచారణ చేయడం లేదని వారు వాపోయారు. ఈ విషయంపై ఎస్‌ఐ విజయకుమార్ నాయక్ మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేశారని, విచారణ చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

వెల్దుర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వే భూగర్భ వంతెన కింద ఉన్న రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు ఊరిలోకి రాకుండా హైవేపై వెళ్తుండడంతో స్థానికులు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎంపీపీ సమస్యను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదివారం మరమ్మత్తు పనులు చేపట్టి గుంతలను పూడ్చివేశారు. గుంతలను పూడ్చివేయడంతో ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కార్యక్రమంలో హరి, జయన్న ఆచారి, మోహన్, వెంకటేశ్వర్లు, మహేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

27 ఏళ్ల అ'పూర్వ' బంధం


గురువులతో పూర్వ విద్యార్థులు

ఆలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహిచంఆరు. 1997-98లో చదువుకున్న పూర్వ విద్యార్థులు అంతా కలిసి సందడి చేశారు. రూ.2 లక్షలతో సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పట్లో చదువులు చెప్పిన ఉపాధ్యాయులు రుక్మిణి, రమణయ్య, మహబూబ్‌సాహెబ్‌లను సత్కరించి షీల్డ్ అందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల చదువుల కోసం సహాయ సహకారాలు అందించా లని సూచించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటు చేయించడం అభినందనీయ మన్నారు. అనంతరం ఒకరికి ఒకరు పలకరించు కుని అలనాటి గుర్తులు నెమరేసుకున్నారు. అనం తరం అందరూ కలిసి డాన్సులు వేసి ఆనందంగా గడిపారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాలకు లబ్ధి


జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి

ఆలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం రాత్రి ఆలూరు పట్టణంలో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల మనం కొనే వస్తువులపై ట్యాక్స్ తగ్గుతుందన్నారు. ఇందుకోసం దేశ ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈనెల 16న కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నారని, ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 350కు పైగా బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాని పర్యటనకు భారీ ఎత్తున జనం తరలిస్తున్నట్లు తెలిపారు.

94 మంది ఉపాధ్యాయుల నియామకం

ఆలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలానికి డీఎస్సీ ద్వారా 94 మంది కొత్త ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలల్లో చేరనున్నట్లు ఎంఈఓ-2 చిరంజీవిరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలో 90 శాతం ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ అయ్యాయని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌లు ఆయా ఉన్నత పాఠశాలల్లో జాయినింగ్ రిపోర్ట్ చేసుకోవాలని, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఎంఆర్‌సీలో రిపోర్ట్ చేసుకోవాలన్నారు.

మొక్కలను పరిరక్షించడం మన బాధ్యత

తుగ్గలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం.. వాటిని పెంచి పరిరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని ఏపీవో హేమసుందర్ అన్నారు. మండలంలో గిరిగిట్ల తదితర గ్రామాల్లో రోడ్ల వైపు నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్ కింద గ్రామాల్లోని అన్ని రహదారుల వెంట మొక్కలు నాటించామని, వాటిని పెంచడం కోసం కూడా ప్రభుత్వం నిధులు అందిస్తుందని, నిర్లక్ష్యం చేయకుండా వాటిని పెంచాలన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి


మొలగవల్లిలో టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారు కొండ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రంగస్వామి, టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి మోక మల్లయ్య అన్నారు. ఆదివారం మొలగవల్లి గ్రామంలో టీడీపీ సభ్యత్వ కార్డులను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను వంద శాతం అమలు చేసి అండగా నిలిచారన్నారు. ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతితోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెలగంటి హనుమప్ప, విశ్వతేజ్, కురువ ఈరన్న, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ షేక్షావలి, అఖిల్‌యాదవ్, మాల నరసింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'మోదీ గో బ్యాక్'

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య


కరపత్రాలను విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజనతో ఏపీకి న్యాయం చేయాల్సిన దేశ ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా తీరని మోసం చేసిన మోడీ గో బ్యాక్ అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, గౌస్‌దేశాయ్‌లు అన్నారు. ఆదివారం స్థానిక సి.ఆర్.భవన్‌లో మోదీ గో బ్యాక్ కరపత్రాలను వామపక్ష పార్టీల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీఎస్టీ సుంకాల తగ్గింపు ఘనకార్యాన్ని చెపకునేందుకు ఈనెల 16న కర్నూలుకు వస్తున్నారని, అయితే అధికారంలోకి వచ్చి మూడు పర్యాయాలు కావొస్తున్నా విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మోదీ ఏమాత్రం కూడా ఉపయోగ పడడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోలేని మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు తలపెట్టే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభయలు రాజాసాహెబ్, మండల కార్యదర్శి కారుమంచి, వెంకటేశ్వర రెడ్డి, నాయకులు రామాంజనేయులు, కారన్న, రవిచంద్ర పాల్గొన్నారు.

ఆదోని అభివృద్ధికి సహకారం అందించాలి


టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసిన నాయకులు

ఆదోని, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదోని అభివృద్ధికి సహకారం అందించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును ఆదివారం టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు కలిసి విన్నవించారు. కర్నూలుకు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి ఉమాపతినాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కర్నూలు స్టేట్ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ భేటీలో కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఉన్నారు.

వ్యాపారాల్లో యువత రాణించాలి : ఎమ్మెల్యే బీవీ



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వ్యాపారరంగంలో యువత రాణించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆదోని బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చంద మామ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే బీవీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్, రెస్టారెంట్లు ఏర్పాటు వల్ల ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం సైతం ఎం ఎస్ఎంఈల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ మల్లయ్య, నాయకులు రంగముని, లక్ష్మన్న, రెస్టారెంట్ నిర్వాహకులు రాము, రామంజి, గిరిలు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధారణం

● మవవిండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి
● 300 మంది క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):ఓ క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధరణమన్ని మంత్రాలయం మాజీ సింగిల్‌విండో అ ధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎం.తాండ గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా కరుణం రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం కరుణం గో పిస్వామి, తిరుమలరావు ఏర్పాటు చేసిన నియోజకవర్గ క్రికెట్ టోర్న మెంట్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ ఎగురవేసి బ్యాటుపట్టి పోటీలను ప్రారంభించారు. గోపిస్వామి 40 మంది క్రీడాకారులకు దుస్తులు అంద జేశారు. ముఖ్య అతిథులకు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. మొదటి బహుమతి రూ.51వేలు, రెండవ బహుమతి రూ.10వేలు, అలాగే ట్రోఫీలను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ నాయక్, అమ్రేష నాయక్, రామచంద్రనాయక్, రాజానాయక్, కన్వీనర్లు సురేష్‌నాయక్, శేఖర్‌నాయక్, కృష్ణనాయక్, నగేష్‌నాయక్, చంద్ర, శేఖర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న రామకృష్ణ

ఎమ్మిగనూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు సిద్దుకు ఎమ్మెల్యే బీవీ ఆదేశాల మేరకు బీవీ యూత్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ వాల్మీకి రామకృష్ణ నాయుడు రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ కోచ్ మాబన్న మాట్లాడుతూ సిద్దుకు బీవీ యూత్ ఫుట్‌బాల్ అసోషియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు వంశీ, రాము, విజయ్‌లు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించిన క్రాంతి



ఎంబీబీఎస్ సీటు సాధించిన క్రాంతిని సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డురాదని ఎంబీబీఎస్ సీటు సాధించి ఎస్ క్రాంతి నిరూపించిందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, అంబేడ్కర్ భవనసాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న అన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్ కాలనీలో నివాసం ఉంటున్న రాజేష్ బాబు కుమార్తె క్రాంతి 2025 నీట్ ఫలితాల్లో మంచి ప్రతిభకనబరచి నెల్లూరు పట్టణంలోని నారాయణ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. దీంతో కేవీపీఎస్, అంబేద్కర్ భవన సాధన కమిటీ, ఎంఆర్‌పీఎస్ ఎన్‌సీసీ నాయకులు, ఉపాధ్యాయులు ఆదివారం విద్యార్థిని క్రాంతి ఇంటికి వెళ్లి అంబేద్కర్ చిత్రపటాన్ని, మిఠాయిలు ఇచ్చి అభినందిం చారు. కార్యక్రమంలో ఆనంద్ చైతన్య, వెస్లిసునీల్, టీచర్ జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఉచిత బస్సును ఏర్పాటు చేసిందని, అయితే బస్టాండ్‌లో మహిళలకు మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం మరిచారన్నారు. ముఖ్యంగా షుగర్ ఉన్న మహిళలు యూరిన్ వస్తే ఎక్కడికి వెళ్లాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయక పోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చామంతి, నాగమ్మ, లక్ష్మీ, రేణుక, సావిత్రి, దుర్గమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



మంత్రాలయం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నియంత్రణ ఉల్లంగించిన వాహనాలపై 14కేసులు నమోదుచేసినట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. ఆదివారం రాఘవేంద్ర సర్కిల్, ప్రధాన రహదారులు సాయంత్రం మంత్రాలయం సమీపంలో మాధవరం రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అకస్మికంగా వాహనాలను తనిఖీ చేశారు. కర్నాటక నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్ల ఆపి ప్రయాణికుల సంచులను తనిఖీ చేశారు. రికార్డులు, అనుమతి లేని వాహనాలపై కేసు మోదు చేసిఅపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

వీటిని రోడ్లంటారా..!

గోనెగండ్ల శివారు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ప్రధానంగా చాకలివీధి, దొనబండవీధి, ఉప్పరవీధి, గంజహళ్లి రోడ్డు నుంచి కేజీబీవీ పాఠశాలకు వెళ్లే రోడ్లు బురదమయం అవుతున్నాయి. సీసీ రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ లేక పోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ కాలనీలకు సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- గోనెగండ్ల, (ఆంధ్రజ్యోతి)



బురదగుంటగా చాకలి వీధి





దొనబండవీధి రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

రొచ్చు రొచ్చుగా ఉప్పరివీధి

ప్రధాని సభను జయప్రదం చేయండి

● మాజీ మంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కోసిగి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మంత్రాలయం నియోజకవర్గం పరిశీలకుడు నెట్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి స్వగ్రా మమైన పల్లెపాడులో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సమక్షంలో పల్లెపాడు రామిరెడ్డి టీడీపీ నాయకులకు తమ స్వగృహంలో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వర్లు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డికి పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గోతులదొడ్డి ఉలిగయ్య, సురేష్ నాయుడు, వక్రాణి వెంకటేశ్, హోళగుంద కోసిగయ్య, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



కాలవ శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకుడు వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న పల్లెపాడు రామిరెడ్డి

తెల్లబంగారానికి కూలీలు కరువు

కోసిగి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):ఓ వైపు కూలీలు లేక పత్తి పొలాల్లో తెల్లబంగారం కూలీల కోసం ఎదురు చూస్తుంది. ఏ పత్తి పంట చూసినా పత్తి పగిలి కూలీల కోసం ఎదురు చూస్తున్నట్లు కనిపిస్తోంది. రూ.400లు కూలీలు ఇస్తామన్నా కూలీలు రావడం లేదు. అయితే.. కోసిగి మండలం నుంచి తెలంగాణకు వలసబాట పడుతున్నారు. స్థానికంగానే కూలీల కొరత ఉన్నప్పటికీ ఇక్కడే ఉంటే మహిళలకు మాత్రమే పని దొరుకుతుందని పిల్లలకు, మగవారికి పని లేదని వలస కూలీల మహిళలు తెలుపుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ కోసిగితో పాటు పలు గ్రామాల్లో పత్తి పొలాల్లో తెల్ల బంగారానికి కూలీలు కరువయ్యారు. వర్షం వస్తే చేతికొచ్చిన తెల్లబంగారం.. నల్లబంగారంగా మారే ప్రమాదం ఉందని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి రైతులు మాత్రం పత్తి తీసేందుకు రూ.400లు కూలీ ఇస్తామన్నా ఎవరూ ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోసిగిలో కూలీలు లేక పత్తి పొలాల్లో వెలవెలబోతున్న తెల్లబంగారం

కోసిగి మండలం.. కొత్త టీచర్లతో కళకళ

● మండలానికి 255 మంది కొత్త పంతులు ● మంత్రాలయం నియోజకవర్గానికి 727 మంది నూతనోపాధ్యాయులు



నేడు కొత్తగా ఉపాధ్యాయులుగా చేరనున్న టీచర్లు

కోసిగి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం.. కోసిగి మండలం అక్షరాస్యతలో దేశంలోనే చిట్టచివరి నుంచి చూస్తే రెండ స్థానంలో ఉంది. కోసిగి మండలంలో 33 ప్రాథమిక పాఠశాలలు, 13 జిల్లా పరిషత్ హై స్కూళ్లు, ఒకటి కేజీబీవీ మోడల్ స్కూల్స్ ఉన్నాయి. అయితే సుమారు 260 ఉపాధ్యాయ ఖాళీల పోస్టులు గతంలో ఉండటంతో అనేక ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయులతో బోధనలు జరిగాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక డీఎస్సీ నోటిఫికేషన్ కూడా భర్తీ చేయకపోవడంతో ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యాబోధనం గాడి తప్పింది. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు మొదటి సంతకం డీఎస్సీ పై నోటిఫికేషన్‌పై పెట్టడంతో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశారు. ఇందులో భాగంగా కోసిగి మండలంలో 255 మంది నూతన ఉపాధ్యాయులుగా సోమవారం విధుల్లో చేరనున్నారు. అలాగే మంత్రాలయం నియోజకవర్గంలో కౌతాళం మండలంలో 257, మంత్రాలయంలో 121, పెద్దకడుబూరులో 92 మంది మొత్తంగా మంత్రాలయం నియోజకవర్గానికి 727 మంది నూతన ఉపాధ్యాయులు నేడు విధుల్లో చేరనుండటంతో అక్షరాస్యతలో మంత్రాలయం నియోజకవర్గం మరింత ముందుకు దూసుకెళ్తుందని ప్రభుత్వ విద్యకు కూటమి సర్కార్ ఎంతో కృషి చేస్తుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. దీంతో మండలం ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు మండలానికి, నియోజకవర్గానికి భారీగా నూతన ఉపాధ్యాయులు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన భజన పోటీలు

● ఆటపాటలతో కళలపై ఆసక్తి రేపిన కళాకారులు ● విజేతలకు బహుమతుల ప్రదానం





భజన పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు..భజన పోటీలలో పాల్గొన్న మహిళా గాయకులు

గోనెగండ్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల మాసపూజల సందర్భంగా ఆదివారం తెల్లవారు జామున జరిగిన జిల్లా స్థాయి భజన పోటీలలో గెలుపొందిన విజేతలకు టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి ప్రభాకర్ నా యుడు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాస పూజలకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇలాంటి పోటీలు గ్రామీణ వాతావరణాన్ని, గ్రామీణ పదాల గొప్పతనాన్ని గుర్తు చేస్తాయని అన్నారు. ఈ పోటీలటో 21 జట్లు పాల్గొన్నాయని, మొదటి బహుమతి 30 తులాల వెండిని అనంతపురం జిల్లా గుర్రపాడు భజన మండలి బృందం సభ్యులు గెలుచుకున్నారన్నారు. అలాగే రెండవ బహుమతి 20 తులాల వెండిని కడిమెట్ల భజన బృందం గెలుచుకుందన్నారు. వారికి నాగరాజు, వెంకటేశ్వర్లు, పద్మనాభయ్య, మునిస్వామి, బహుమతులు ప్రదాన చేశారు. అలాగే మూడవ బహుమతి 15 తులాల వెండిని ఆలంకొండ భజన బృందం గెలుచుకుందని, నాలుగవ బహుమతిని 10తులాల వెండిని తురకపల్లె బజన భజన బృందం, ఐదవ బహుమతి 8 తులాల వెండిని మామిళ్లకుంట భజన బృందం, ఆరవ బహుమతిని మండ్లవాని పల్లె భజన బృందం, ఏడవ బహుమతిని కొత్తూరు భజన బృందం, ఎనిమిదవ బహుమతిని బండగట్టు భజన బృందం, తొమ్మిదవ బహుమతిని మారెళ్ల భజనబృందం, పదవ బహుమతని చనుగొండ్ల భజన బృందం దక్కించుకుందని వివరించారు. అలాగే స్వామి వారి పై పాటలకు నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. లక్ష్మయ్య, ఓబులయ్య, మునెయ్య, లక్ష్మీకాంత్, చంద్రశేఖర్, చిన్నయ్య, చిన్నరంగస్వామి, నరసింహులు, చిన్నరంగస్వామి, రామలింగయ్య, రామకోటయ్య హాజరయ్యారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు



గోపూజ చేస్తున్న భక్తులు

నందవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమలగూడురులో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తిరుపతి-తిరుమల దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టరు మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సోమలగూడురులో లక్ష్మీ నరసింహ ఆలయంలో చేపట్టిన ధార్మిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే గోమాతకు కుంకుమార్చన, పూజలు చేశారు. గ్రామ పెద్దలు రుక్మాంగారెడ్డి, ఆనందరెడ్డి, ఆలయ దర్మకర్త వీరేష్, శ్రీనివాసులు, రామచంద్ర, తిక్కయ్య, రామలింగప్ప, సర్పంచ్ గోవిందు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే సమాజానికి కృషి చేయాలి



పట్టణంలోని కుర్ణికమ్యునిటీ హాల్ దగ్గర శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే సమాజం హితం, సంఘటిత శక్తికోసం దేశరక్షణకోసం కృషి చేయాలని ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. ఆదివారం ఏబీవీపీ నగరశాఖ ఆధ్వర్యంలో కుర్ణికమ్యునిటి హాల్‌నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు శోభాయాత్ర నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలో ఉన్న కులాల కుళ్లును తుడిచే విధంగా పనిచేయాల న్నారు. వ్యక్తి నిర్మాణం ద్వారా సమాజం నిర్మాణం జరుగుతుందన్నారు. సమాజంలో మహోన్నతమైన వ్యక్తులను విద్యార్థి పరిషత్ ఎప్పుడు స్మరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, చంద్రశేఖర్, కర్నూలు జిల్లా కన్వీనర్ వీరేష్, నంద్యాల జిల్లా కన్వీనర్ యుగందర్, శ్రీనివాసులు, మారుతిలు పాల్గొన్నారు.

హమాలీలకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి



వినతితప్రం అందిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పిం చటంతో పాటు ఏడాదికి రెండు జతల దుస్తులు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆది వారం సంఘం ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్కెట్ సూపర్‌వైజర్ ఎర్రిస్వామికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలు సమస్యలను పరిష్కరించటంలో అధికారులు విఫలమవుతున్నార న్నారు. 60ఏళ్లు నిండిన హమాలీలకు పించన్ రూ. 8వేలు ఇవ్వాలని, కమీషన్ ఏజంట్ల దగ్గర పనిచేస్తున్న హమాలీలకు ప్రమాదాలు జరిగితే కమీసన్ ఏజెంట్ బాధ్యత వహించి చికిత్సలు చేయించాలన్నారు.హమాలీల లైసన్సులు రెనెవల్ చేయాలని, అలాగే కొత్త లైసన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, మల్లికార్జున, అఖిలభారత రైతుకూలి సంఘం నాయకులు సత్యన్న, పెద్దిరెడ్డి, వీరేష్, భాషలు పాల్గొన్నారు.

21 నుంచి సీసీఐ ఆధర్యంలో పత్తి కొనుగోలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు జిన్నింగ్ మిల్లుల్లో ఈనె 21 తేదీ నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటి ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10న కర్నూలులో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సీసీఐ పత్తికొనుగోలు చేసేవిధంగా ఆదేశించారన్నారు. త్వరలో ఏ మండల రైతులు ఏ మిల్లుకు తీసుకెళ్లాల్లో జిన్నింగ్ మిల్లుల మ్యాపింగ్ చేసిన తరువాత తెలియజేస్తామన్నారు. ముందుగా పత్తిరైతులు కిసాన్ కప్పాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. తెలియని వారు దగ్గరలోని ఆర్‌ఎస్‌కేలలో ఉన్న వీఏఏల దగ్గర వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

స్వర్ణ పల్లకిలో దర్శనమిచ్చిన రాఘవేంద్రులు



స్వర్ణపల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రులు

మంత్రాలయం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళవాయిద్యాల మధ్య శ్రీ రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అశ్వయుజ కార్తిక షష్ఠి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి శ్రీమఠం ప్రాంగణం చుట్టు అంగరంగ వైభవంగా ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తుల జయ ధ్వనుల మధ్య స్వర్ణ పల్లకి ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకటుకుంది. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

రూ 2లక్షల నగదును అందజేస్తున్న రంగారెడ్డి

ఆలయానికి రూ.2 లక్షలు విరాళం

నందవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని ముగతి గ్రామంలో వెలసిన సుకలమ్మ దేవాలయానికి రూ.2 లక్షలు విరాళం ఆదివారం బీమిరెడ్డి కుమారుడు రంగారెడ్డి ఆలయ నిర్వహకులు మాజీ జడ్పీటీసీ ఈరన్నగౌడుకు అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం ఎల్లప్పుడు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సోమనాథ్‌యాదవ్, బార్గవ్‌యాదవ్, రాఘవరెడ్డి, తారకరాముడు, ఉరుకుందురెడ్డి, అనుమంతురెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.